క్లుప్తంగా

గంగపుత్రులకు సముచిత స్థానం



బాన్సువాడ రూరల్: తెలంగాణ ప్రభుత్వం గంగపుత్రులకు అభివృద్ధిలో సముచిత స్థానం కల్పించిందని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నాగారం గ్రామంలో గంగపుత్రలతో కలిసి గంగమ్మ గుడి, గంగపుత్ర సంఘం షెడ్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్పంచ్ రాచప్ప, పంచాయితీ కార్యదర్శి పుట్టి శ్రావణ్‌కుమార్, ఉప సర్పంచ్ పిట్ల సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసి దశాబ్ది ఉత్సవాలు చేయండి

కామారెడ్డి అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ఏమిటని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి మంగళవారం విమర్శించారు. బంగారు తెలంగాణ అని చెప్పిన కేసీఆర్ తన కుటుంబం, బంధువుల కుటుంబాలను బంగారం చేసుకున్నారని, ప్రజలకు మాత్రం కష్టాలు, కన్నీళ్లు మిగిల్చారని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి, పంట రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని హితవు పలికారు.

ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీటీసీ ఉషాగౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ అశోక్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

1న తెరవే 'ధైర్యకవచం' పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రాసిన కవితా సంపుటి 'ధైర్యకవచం' పుస్తకావిష్కరణ సభ జూన్ 1న గురువారం ఉదయం 10–30 గంటలకు కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెరవే ప్రతినిధి, గజల్‌కవి సూరారం శంకర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పుస్తకావిష్కరణ సభకు జానపద కళల పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు, టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ తదితరులు హాజరవుతారన్నారు.

పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి

దోమకొండ: మండల కేంద్రంలోని పలుగుగడ్డ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన భవన నిర్మాణ పనులను మంగళవారం జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. రూ.72 లక్షలతో పాఠశాలలో మరమ్మతులు చేస్తున్నారన్నారు. వచ్చేనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని, పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లవు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నీరు పోయే మార్గమేది?



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బేగంపూర్‌తండాలో కొన్ని రోజుల నుంచి రోడ్డుపై మురుగు నీరు నిలువ ఉన్నా అధికారులు కానీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటితో దుర్గంధంతో పాటు దోమలు పెరుగుతున్నాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- రికార్డులకే పరిమితమవుతున్న తీర్మానాలు, నివేదికలు
- నేడు బిచ్కుంద మండల సర్వసభ్య సమావేశం

బిచ్కుంద(జుక్కల్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు దృష్టి సారించకపోవడంతో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇద్దరి మధ్య సమన్వయ లోపంతో మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కరువయ్యాయి. బుధవారం జరిగే మండల సర్వ సభ్య సమావేశంలోనైనా సమస్యలపై చర్చించి పరిష్కారం వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శాంతాపూర్, దేవాడ, దడ్గి గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. వైకుంఠధామాల వద్ద కరెంటు, నీటి వసతి లేదని, చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించ లేదు. ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పుల్కల్, బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది లేరు, మందులు, వైద్య పరికరాలు లేక రోగులకు ఇబ్బందిగా మారింది. మన ఊరు మన బడి పథకం కింద మండలంలో 18 పాఠశాలలు ఎంపికయ్యాయి. రూ. 5 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తి చేయాల్సి ఉండగా 5 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, బాన్సువాడ రోడ్డు, కోర్టు, టీచర్స్ కాలనీ, మౌలాలీ పీర్లు వద్ద ప్రధాన వీధులలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. బిచ్కుంద గ్రామ పంచాయతీకి వార్డు సభ్యులు తాళం వేసి నిరసన తెలిపారు. మండలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతుంది.



బిచ్కుందలో నిర్మించని మురికి కాలువలు, పక్కన సీసీ లేని రోడ్డు



బిచ్కుంద బస్టాండ్ ఎదురుగా చెత్త

కాలువల మరమ్మతులపై..

చెరువుల తూములు, అలుగులు, కాలువల మరమ్మతులపై ఇరిగేషన్ శాఖ, బోరు మోటారు వద్ద కరెంటుపై విద్యుత్ శాఖ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వచ్చే వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య పనులపై సమావేశంలో చర్చించి పరిష్కారం వైపు అడుగులు వేయాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

గళమెత్తని మహిళా ప్రజాప్రతినిధులు..

సర్పంచ్, ఎంపీటీసీగా గెలిచిన మహిళలు సమావేశాలలో సమస్యలపై గళమెత్తడం లేదు. మండలంలో ఏడుగురు ఎంపీటీసీలు, 13 మంది సర్పంచులున్నారు. వీరి స్థానంలో భర్త, కుమారులు పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో సమస్యలపై మహిళలకు అవగాహన లేక సమావేశాలలో గళమెత్తడం లేదు. ఈసారైనా ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

భిక్కనూరు: దేశంలోని 19 రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో కూడా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. మంగళవారం భిక్కనూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రజక కులవృత్తిదారులకు ఆర్థిక సహకారం కింద రూ.లక్ష ఇస్తామని ప్రకటించిందని, ఈ రోజుల్లో ఈ రూ.లక్ష దేనికీ సరిపోవన్నారు. దళిత బంధు మాదిరిగానే రజకులకు రూ.10 లక్షల సహాయం అందజేయాలన్నారు. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, మండల నాయకుడు మ్యాతరి నర్సింలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమితి నేత గోపి

రైతులను నిండా ముంచిన ప్రభుత్వం

కామారెడ్డి టౌన్: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని బహుజన లెఫ్ట్ పార్టీ(బీఎల్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధిరాములు విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికీ రూ.లక్ష రుణమాఫీని చేయలేని పరిస్థితిలో ఉందన్నారు. రూ.1600 కోట్లతో సెక్రటేరియట్ నిర్మించిన సీఎం పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోలేదన్నారు. ధరణి పేరుతో రైతులను ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నాయకులు ముద్రకోల ఆంజనేయులు, కమ్మరి సదానందం, వడ్ల సాయికృష్ణ, గంగామణి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్‌పీ నేత సిద్ధిరాములు

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బురుగుపల్లిలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ అంజయ్య మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామాలలో ఎక్కడైనా పౌర హక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనగాంలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జనగాంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య మాట్లాడుతూ...ఎస్సీల సంక్షేమం కోసం కల్పిస్తున్న హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మొలిగె శంకర్, ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



జనగాంలో మాట్లాడుతున్న అధికారులు, పక్కన హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య తదితరులు

కాంగ్రెస్‌లో చేరికలు



దోమకొండ: సీతారాంపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో షబ్బీర్ అలీ కచ్చితంగా విజయం సాధిస్తారని ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులున్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ జొన్న విజయారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీకి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించేందుకు పలు తీర్మానాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బుడతడి కళా నైపుణ్యం



ఎ.సుప్రతీక్‌గౌడ్

కామారెడ్డి అర్బన్: వేసవి సెలవుల్లో ఓ బుడతడు తనలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సుప్రతీక్ గౌడ్ 4వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద బంక మట్టితో రాకెట్, గణేషుడు, శివలింగం, జాతీయ జెండా, స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తి, టీవీ, చెట్టు, సోఫాలో నిద్రిస్తున్న వృద్ధుడు, కారు తదితర 40 రకాల బొమ్మలను తయారు చేసి తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. చిన్నతనంలోనే ఇంత నైపుణ్యం ప్రదర్శించిన భవిష్యత్‌లో మంచి కళాకారుడవుతాడని గ్రామస్తులు ప్రశంసించారు.



బంక మట్టితో తయారు చేసిన కళాకృతులు

ధాన్యం బిల్లుల చెల్లింపులో ఆలస్యం తగదు

భిక్కనూరు: ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెబుతున్న ప్రభుత్వం 15 రోజులు గడిచినా ధాన్యం బిల్లులను జమ చేయడం లేదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వలకొండ రవీందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. ధాన్యం కాంటాలు చేసే వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. తరుగు పేరిట క్వింటాల్‌కు ఆరు కిలోల వరకు తీసుకుంటున్నారని ఇది ఏంటని ప్రశ్నిస్తే ధాన్యం పొల్లుగా ఉంది జాలి పట్టాలని విండోల సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ భిక్కనూరు పట్టణాధ్యక్షుడు గేరిగంటి నర్సింలు, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి అరిగె నర్సింలు, రాజు పాల్గొన్నారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

రెడ్డి హాస్టల్ భవన నిర్మాణ పూజకు తరలిరావాలి



మాట్లాడుతున్న రెడ్డి ఐక్యవేదిక సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విద్యా పరిషత్ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరగనున్న రెడ్డి హాస్టల్ విద్యాలయం సంక్షేమ భవనం నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి జిల్లాలోని రెడ్డి సంఘాల నాయకులు, రెడ్డి కులస్తులు కుటుంబ సమేతంగా తరలిరావాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లబెల్లి కరుణాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పేద రెడ్డి విద్యార్థుల కోసం ఈ హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యా పరిషత్ ట్రస్ట్ చైర్మన్ చంద్రారెడ్డి, కార్యదర్శి కొలిమి రాజ్‌కుమార్ రెడ్డి, సభ్యులు బాణాల మల్లారెడ్డి, సంతోష్ రెడ్డి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



రాజంపేట: సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, అధికారులు



మాట్లాడుతున్న నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్

రాజంపేట/ఎల్లారెడ్డి/బిచ్కుంద/నాగిరెడ్డిపేట : జూన్ 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. రాజంపేట, ఎల్లారెడ్డి, బిచ్కుంద, నాగిరెడ్డిపేటలలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరపాలన్నారు. రోజువారీ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ ఉత్సవాలలో పాల్గొనేలా చూడాలని, ఉత్సవాల నిర్వహణపై డాక్యుమెంటరీ తయారు చేయాలని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో వీసీ నిర్వహించారు.

సమాచారం..

■ **నేడు ప్రొఫెసర్ కోదండరాం రాక**



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి బుధవారం ప్రొఫెసర్ కోదండరాం వస్తున్నట్లు టీజేఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. మండలకేంద్రంలో టీజేఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ, కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇటీవల వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

■ **జూన్ 1న డెయిరీ ప్రదర్శన**

కామారెడ్డి అర్బన్: ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా జూన్ 1న పాలు, పాల పదార్థాల ఆవశ్యకతను తెలిపే ఊరేగింపు, రైతు శిక్షణ శిక్షణ శిబిరం, డెయిరీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్ చంద్ర తెలిపారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ సంయుక్త సహకారంతో జూన్ 1న ఉదయం ఊరేగింపు, అనంతరం 10గంటలకు కళాశాల ఆడిటోరియంలో రైతు శిక్షణ, సాయంత్రం 4గంటలకు మున్సిపాల్ కార్యాలయం ఎదుట డెయిరీ ప్రదర్శన ఉంటుందన్నారు.

■ **నేడు ఐలమ్మ విగ్రహావిష్కరణ**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నట్లు రజక సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

■ **బోనమెత్తిన పల్లెలు**



నిజాంసాగర్(జుక్కల్): నర్వలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అలాగే సుల్తాన్‌నగర్ గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు బోనాల ఊరేగింపు చేశారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మాపూర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): లక్ష్మాపూర్‌లో మంగళవారం బోనాల పండగను నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మతల్లి, పోచమ్మ అమ్మవారికి గ్రామస్తులు బోనాలను సమర్పించారు. లక్ష్మాపూర్‌లో బుధవారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ రవీందర్‌గౌడ్ తెలిపారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం ముదిరాజ్ కులస్తులు వారి ఆరాధ్య దైవమైన ఆదిపరాశక్తి పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

దేమికలాన్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. బోనాలతో ప్రధాన వీధులలో తిరుగుతూ ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవతలకు సమర్పించారు.

■ **ప్రారంభమైన గంగామాత ఆలయ ఉత్సవాలు**



భిక్కనూరు: మండల కేంద్రంలో గంగమాత ఆలయ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ప్రధాన వీధుల మీదుగా గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని భాజభజంత్రీల నడుమ ఊరేగించారు.

■ **కొనసాగుతున్న ఆలయాల ఉత్సవాలు**

బీబీపేట: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి, ముత్యాలమ్మ, పోచమ్మ, నాయికమ్మ ఆలయాల ఉత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. మున్నూరు కాపు సదరు సంఘం అధ్వర్యంలో జరుపుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పూజలు చేశారు.

■ **అయిలాపూర్‌లో విగ్రహాల ప్రతిష్ఠాపన**



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ గ్రామ చెరువు కట్టపై మంగళవారం అల్లూరమ్మ, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మూడు రోజుల పాటు గ్రామంలో ఊర పండగలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ధనలక్ష్మి తెలిపారు.

■ **కాలభైరవుడికి సింధూర పూజలు**



రామారెడ్డి: కాలభైరవుడి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి జలాభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

36వ రోజుకు చేరుకున్న రిలే నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంభిస్తున్న పర్యావరణ వ్యతిరేక విధానాలకు నిరసనగా కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకు పోరాటం సాగిస్తామని గ్రామస్తులు తెలిపారు.

భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 31న రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విద్యా పరిషత్ ఆధ్వర్యంలో జరిగే భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెడ్డి ఐక్య వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మోహన్‌రెడ్డి కోరారు. వివిధ గ్రామాలలో మంగళవారం తిరుగుతూ భూమిపూజ ఆహ్వాన పత్రికలను రెడ్డి కులస్తులకు పంపిణీ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. అన్ని జీపీ కార్యాలయాలు ఇళ్ల వినియోగదారుల నుంచి వసూల్ చేసిన బిల్లుల నుంచి 8 శాతం గ్రాంటును గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ రికవరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె రమేశ్ తన సెల్ ఫోన్ పోయిందని 2 రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా ట్రాక్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. మంగళవారం బాధితుడికి ఫోన్ అందజేసినట్లు చెప్పారు.

జీలుగ విత్తనాలతో అధిక దిగుబడులు

భిక్కనూరు: రైతులు జీలుగ విత్తనాలను విత్తుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని భిక్కనూరు సింగిల్ విండో అధ్యక్షుడు గంగళ్ల భూమయ్య అన్నారు. మంగళవారం భిక్కనూరు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగ విత్తనాల విక్రయకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. భూమయ్య మాట్లాడుతూ.. ఎకరాకు ఒక బస్తా జీలుగ విత్తనాలను విత్తుకోవడం వల్ల భూమిలో పోషక విలువలు పెరుగుతాయన్నారు. విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భూమి సారవంతం కోసం జీలుగను విత్తుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భూమి సారవంతం కావడానికి జీలుగను విత్తుకోవాలని వ్యవసాయ విస్తర్ణాధికారి రాజాగౌడ్ మంగళవారం తెలిపారు. ఆజామాబాద్ సొసైటీలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండలో వ్యవసాయ బావుల వద్ద కరంట్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పించినందుకు గ్రామస్తులు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొత్తూరి లతారాజేశ్వర్ మాట్లాడుతూ.. రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే విన్నవించడంతో వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పించారని, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.